# "ఎర్రగులాబి"

"శ్రీవాణి"

నీలాకాశంలో ఏదో క్రొత్త కాంతితో ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు. గర్వంగా మబ్బు తెరలు చంద్రునికి దగ్గరగా దాటి పోతున్నాయి, దూరంగా పయనిస్తున్న మేఘాలు వాటిని చూసి అసూయ పడుతున్నాయి. మందంగా చల్లని పిల్లగాలి తెరలు తెరలుగా వీస్తుంది. తెల్లవారితే ఆదివారం ఆఫీసు 'నరకం'లో నుంచి బయట పడినట్లుంటుంది. ఈ ఆదివారం మీద ఉద్యోగులు ఎన్ని ఆశలు పెంచుకొన్నారో? అర్ధ రాత్రయినా ఎంచేతనో నిద్ర పట్టడంలేదు. ఏం చేయాలో తోచడంలేదు. ప్రక్క మంచం మీద పాపడు కదులుతున్నాడు. వాడి చిట్టి చేతుల్తో దూరంగా వొదిలేసి నిద్రబోతున్న అమ్మను వెతుక్కుంటున్నాడు. పెళ్ళయిన రెండేళ్లలో ఎంతమార్పు! గతం లీలగా గుర్తుకు రాగానే నవ్వొస్తున్నాను.

దూరం నుండి భజన సంఘం వారి కీర్తనలు మైకులో వినిపిస్తున్నాయి. సినిమా స్టయిల్లో వారి వారి భక్తిని నిరూపించుకోడానికి ఆస్టయిల్ అనుకరణా, మైకూ అవసరమూ! అనిపించింది. ఏమయినా నాగరికత!

నల్లుల బాధ ఎక్కువయి నట్లుంది. 'శ్రీమతి' కదుల్తుంది. తన తెల్లని పూలచీర పండు వెన్నెలను తోడు చేసుకొని మురిసి పోతుంది. ముఖం మీద వెన్నెలకాంతి ఏదో క్రొత్త అందాన్ని అందించింది. తలలోని పూలు నలిగి మత్తుగా సుగంధాన్ని విరజిమ్ముతున్నాయి. వాటిపై ఎందుకో జాలేసింది_ అవిబాధగా నలుగుతూ కూడా ఆనందాన్ని అందివ్వడానికి ప్రయత్నిస్తున్నందుకు.

ఏవేవో ఆలోచనలు మస్తిష్కం నిండాయి. నిద్రవచ్చేటట్లు లేదు. ప్రక్కనున్న 'వీక్లీ' తిరగ వేస్తున్న ట్రాన్సఫారమ్ లైట్ కాంతిలో. ఒక పేజీ మీద దృష్టినిలిచింది. ఆలోచనలన్నీ ఒక రూపంలో ముందుకి పరుగుడుతున్నాయి. ఆ చిత్రాన్ని చూస్తూనే కొద్దీ—

వికసించిన శ్వేత గులాబీ చివురాకుల్లోంచి యీ లోకాన్ని భీతిగా చూస్తుంది. ఒక లావణ్యవతి మురిసిపోతూ దాన్ని త్రుంచడానికి ప్రయత్నిస్తుంది. క్రొత్త క్రొత్త ఊహాలు ఆలోచనలు నాకు తెలికుండానే నాలో ప్రవేశించాయి.

"నీకేం అపకారం చేశాను? నన్ను త్రుంచకు" గులాబి అంది_

"నువ్వు అందంగా నన్నాకర్షించావు" అందామె.

"నన్నుచంపకుండా చూసి ఆనందించలేవా?"

"వీల్లేదు. నన్నెందరు చూసి ఆనందిస్తున్నారు గనుక?"

"ఆ నీచత్వాని కెందుకు అలవాటు పడ్డావ్? అది నీ అవివేకం."

"నీ అమాయకత్వానికి నాకు నవ్వొస్తోంది. వృత్తి ధర్మం నెరవేర్చడం అవివేక మెలాఅవుతుంది?"

"ఎందుక్కాదు. కేవలం బ్రతకటానికై వృత్తి ధర్మం పేరిట శీలా నమ్ముకొంటున్నావ్. బ్రతకటానికి చాలా మార్గాలునాయ్."

"నీ నీతులు వినే ఓపిక నాకులేదు. నా కోసం నా ప్రియులెందరో వేచియుంటారు.

"నీ జీవితమే స్వల్పం_ ఎలాగూ వాడిపోతావు..."

"ఆగు దయచేసి నన్ను ముట్టకు. నా బ్రతుకు స్వల్పమే అయినా పవిత్రంగా భగవత్సన్నిధిచేరుకోగలను నీ తుచ్ఛమైన సౌఖ్యాల కొరకు నా పవిత్రతను భంగం చేసుకోను." నిర్భయంగా అంది తేగులాబి.

(తరువాయి 16 వ పేజి)

## ఎర్రగులాబి

(6 వ పేజి తరువాయి)

"శేటుగారు వేచి యున్నారు త్వరగా రామ్మా!'' లోపలున్నుండి వొక ముదుసలి కంఠం ఆజ్ఞా పూర్వకంగా వినిపించింది.

తొందరగా త్రుంచబోయింది ఆ యువతి. గులాబి పక్కకు తప్పుకొంది.

"భగవాన్? ఏమిటి పరీక్ష?'' అది గులాబీ విలాపన.

ప్రశాంత ప్రకృతి ప్రళయంగా మారింది. చిరుగాలి పెనుగాలిలా మారిపోయింది ఒక్కసారిగా. గులాబీ విజృంభణతో ఆమె వంటినిండా ముళ్ళు గుచ్చుకొని గాయాలు చేశాయి. ఆమె శరీరం రక్తధారలతో నిండినా ఆమె పెనుగులాడుతూనే వుంది. మొక్కతో. ఆవేశంలో వాడి ముళ్ళను సైతం లెక్కచేయలేదామె. కొమ్మను రెండు చేతుల్తో పట్టుకుంది. వున్నట్టుండి ఆకాశం భయంకరంగా ఉరిమింది ఆ ధ్వనిలో "ప్రభూ!" అని సన్నని ఆర్తనాదం విన గలిగిందామె.

ఆమె తేరుకొనే లోపల అప్పటి కాలేగులాబీ నేలపై కళావిహీనంగా పడి వుంది.

ఆమె చూచింది.

ప్రక్కనున్న పాపడు 'కెవ్వు' మని కేక పెట్టి ఏడుపు మొదలెట్టాడు. 'శ్రీమతి' లేచింది. ఆలోచనలన్నీ చెల్లా చెదరయి పోయాయి, 'వీక్లీ' లో పేజీ భారంగా తిప్పాను...




### మణిమంజరి

(వార్షిక సంచిక 1964)
ప్రచురణ:
జిల్లాపరిషత్ మాధ్యమిక పాఠశాల
చౌటుపల్లి
(నిజామాబాద్ జిల్లా)

ఊహ, ఉపజ్ఞ అనేవి ఉంటే ప్రజ్ఞ అదంతటదే ప్రజ్వరిల్లుతుంది. విద్యార్థులలో నిబిడీకృతమైన క్రియాత్మక శక్తికి, సరియైన మార్గదర్శకత్వంలో వారు చేయగల ప్రశంసార్హమైన కృషికి తార్కాణం "మణిమంజరి" పేరిట, పై స్కూలువారు వెలువరించిన, వారి వార్షిక సంచిక. ఇరువది పేజీలలో స్టెన్సిల్ చేయబడిన ఈ సంచికలో ప్రతిపేజీ విద్యార్థుల రచనలతోను, విద్యార్థులూ, ఉపాధ్యాయులూ వేసిన చక్కని చిత్రములతోనూ కనున్నలపండువగా వుండి వారి కృషిని "శహబాష్" అనిపించేటట్లుంది. ఎంతటి అందమైన సంచికను వెలువరించి సంపాదక వర్గపు సభ్యులు శ్రీ యుతులు టి జయదేవ్ (హెడ్మాస్టర్), కె అంబరీష్(టీచర్) రవీంద్రనాద్ (8 వ తరగతి విద్యార్థి) ప్రత్యేకంగా అభినంద నీయులు. వారి కృషి ఇతర విద్యా సంస్థలకు ఆదర్శప్రాయమ్ములవుతుందని విశ్వసిస్తున్నాము.

— కె. ఆర్. కె. మోహన్.

### రాఘవ శతకము

(లోకాలోకనము)
రచన: పుల్లెల శ్రీరామచంద్రుడుగారు
వెల 1 రూపాయి
ప్రతులకు: యం, సూర్యనారాయణమూర్తి
యూనివర్సల్ బుక్ సెంటర్, అమలాపురం.
(తూర్పుగోదావరి జిల్లా)

శ్రీరామ చంద్రుడుగారు రాఘవ మకుటముతో ఈ నాటి లోకపుతీరు తెన్నులను పర్యాలోకించారు. అందుకు ఉదాహరణ:

"చదువొక పెద్ద భూతమది
సాగిన పిమ్మట నౌకరీలకై
కదలుచునైన వారలను గాచను
వారిని కాళ్ళు పట్టుచున్
వెదకి లభించినంత నది వీడి
మరొక్కటి యంచు నిత్యమున్
బదవులకోస మిట్టటుల బర్వుల నెత్తును
మయ్య రాఘవా"

"శ్రీ శ్రీరామచంద్రుడుగారు వ్రాసిన ఈ రాఘవ శతకమునందు పైన పేర్కొనబడిన (మాధపెద్ది బుచ్చి సుందర రామశాస్త్రిగారి మృత్యుంజయ శతకము, విశ్వనాథ సత్యనారాయణగారి విశ్వేశ్వర శతకము వంటివి) విశిష్టలక్షణము లన్నియును కొంతలో కొంతగా గలవు" అని ప్రస్తావన చేశారు డా। కేతవరపు రామకోటేశ్వరశాస్త్రిగారు.

ఈనాటి వెర్రి పోకడలపట్ల కవి చెందుతున్న ఆవేదన ప్రతి పద్యంలోను కనిపిస్తూనే వుంది. 22 పేజీలు గల ఈ పుస్తకం వెల రూపాయి పెట్టడం ఎక్కువే.

— కె. వి.